# బొమ్మా-బొరుసూ

**వీరుబొట్ల సత్యనారాయణమూర్తి**

"ఎందుకండీ పిలిచారుట" అన్నాడు తొమ్మిదేళ్ల క్రిష్ణమూర్తి లోపలికి వొస్తో.

"నీకో తాయం పెడతాను. నాకో చిన్న పని చేసిపెడతావూ" అంది శ్యామల క్రిష్ణమూర్తిని దగ్గిరికి తీసుకుంటూ.

"ముందు పెడితే..."

"ముందే పెడతానోయ్"

"అలాగే చేసిపెడతాను" అంటూ బుజా లెగరేశాడు క్రిష్ణమూర్తి.

శ్యామల బీరువాతీసి సీసాలో వున్న బిస్కట్లు తీసి క్రిష్ణమూర్తికి పెట్టింది. క్రిష్ణమూర్తి బిస్కట్లు ఆబగాతింటూ "ఎంత మంచివారండీ మీరు. మీకో పాపాయి లేదుగాని వుంటే ఎంత గారంగా పెంచేవారో. మా అమ్మ చూడండీ. ఎప్పుడూ కొట్టడమే. ఎప్పుడేనా తింటానికి అడిగితే కంయ్‌బొంయ్‌మని కుక్కలా కరవడానికి వొస్తుంది"

"తప్పు నాయనా! మీ అమ్మ నలా అనకూడదు. మీఅమ్మ ఎంతో మంచిది. మీ అమ్మకి నీమీద ఎంత ప్రేమని. మా యింటికొచ్చినప్పుడు ఎప్పుడూ నీగురించే నీమంచితనాన్నిగురించే చెబుతారు. మీనాన్నగారు కూడా నిన్ను పెద్ద చదువులు చదివించి బుద్ధిమంతుణ్ణి చెయ్యాలని చూస్తున్నారు" అంది శ్యామల అతని నుదురునీ బుగ్గలనూ తన లేతవేళ్లతో పుణుకుతూ.

"ఏం పెద్ద చదువులోగాని మా అమ్మ మాత్రం నేను రాత్రి పదింటిదాకా చదివితేగాని ఊరుకోదు. చీపురుకట్ట తీస్తుంది"

"మరి మొగపిల్లాడు చదువుకో వొద్దుటోయ్! చదువుకుంటే ఎంతైనా లాభం వుంది"

"క్రిష్ణమూర్తి శ్యామలను గౌరవంగా చూస్తూ ఆమెదగ్గిరిగా కూచుని బిస్కట్లు తింటూనే ఉన్నాడు. కొన్ని సెకన్ల నిశ్శబ్దం తరవాత శ్యామల "క్రిష్ణమూర్తీ నిన్నొక టడుగుతాను చెప్తావా"

"ఓ"అంటూ బుర్రఊపాడు క్రిష్ణమూర్తి.

"మీ నాన్నగారికీ మీ అమ్మగారికీ ఎప్పుడన్నా దెబ్బలాటలు వొస్తాయా? మీ నాన్నగారు ఎప్పుడైనా మీ అమ్మని కొడతారా?"

శ్యామల ఈమాట అని కిందిపెదవి కొరుక్కుంది. క్రిష్ణమూర్తి ఆశ్చర్యంగా చూస్తూ "ఏమో నాకు తెలీదండి. మా అమ్మమాత్రం పుట్టింటికి వెళ్లనంటే" పట్నంవాసన విడిచి వెళ్లలేవేం? పుట్టింది పల్లెటూళ్లో నేగా "అంటారు" అన్నాడు అమాయికంగా.

శ్యామల కళ్లు చెమర్చాయి. అయినా చెమ్మగిలిన కళ్ళతోనే నవ్వుతూ డ్రాయరు సొరుగుతీసి ఒక వుత్తరం ఒక అర్ధరూపాయి కాసూ ఇచ్చింది. ఒక కాగితం యిచ్చింది.

క్రిష్ణమూర్తివంక తిరిగి "ఈ వుత్తరాన్ని రిజిస్టర్ చేయించాలోయ్. ఈ చిన్న కాయితంమీద ఎడ్రస్ రాశాను. ఒక కవరు కొని దానిమీద ఈ ఎడ్రస్ తెలుగులోనే రాయి. కవరు అంటించిం తరవాత పోస్టుమాస్టరుగారికి అరణాలిచ్చి రిజిస్టర్ చెయ్యమను."

"అలాగేనండీ అంటూ జారిపోతూన్న హాఫ్ పేంటును పైకి లాగుకుంటూ వెళ్లిపోయాడు క్రిష్ణమూర్తి.

శ్యామల క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాక అనదనుకున్న పెద్దపని తీరినట్టు బరువుగా ఊపిరి వొదిలింది.

* * *

రాత్రి పదకొండవుతుంది. చిక్కగా వుంది చీకటి. గది కిటికీదగ్గిర కూచుని శ్యామల నిశ్శబ్దంగా ఏడుస్తోంది మాటిమాటికీ పమిటచెంగుతో కాటుక కళ్ళు తుడుచుకుంటూ. పక్కింటి కృష్ణవేణిగారి క్రిష్ణమూర్తి గంటదాకా చదువుతోనే వున్నాడు. ఆ కుర్రాడి గురించి తలపోస్తూ తన స్థితిని చూసి ఏడుస్తూ అలానే కూచుంది.

అరగంట కొట్టింది గడియారం.

శ్యామల ఆవలిస్తూ లేచింది. తలుపుతట్టిన ధ్వని వినవొచ్చింది. నిశ్శబ్దంగా శ్యామల తలుపుతీసింది. నారాయణరావు లోపలికి వొచ్చాడు. స్టాక్సూ బూటూ తనే విప్పుకున్నాడు. కోటుకూడా తనే విప్పుకుని కోట్ హేంగర్‌కి తగిలించాడు.

శ్యామల ధర్మాస్ ఫ్లాస్క్ తెచ్చి బల్లమీద పెట్టింది కాఫీతాగాడు. ఇంతలో వొంటింటిలోకి వెళ్లింది శ్యామల. బయటికొచ్చి నడవలో కూచుంది. పదినిముషాలు సిగరెట్ తాగుతూ పేపరు చదివి వొంటింటో కెళ్లి భోంచేసి చక్కా వొచ్చాడు.

శ్యామల మడత మంచంమీద పడుకుని దుప్పటి మడతల్లోంచి గదిలోని చీకట్లోకి చూసింది. సింహ్లైకన్ను పన్నెండుంబావు చూపుతోంది.

మెల్లిగా కళ్లు ఎడంవైపు తిప్పింది. నారాయణరావు నిద్రపోతున్నాడు. నిశ్శబ్దంగా నడిచివెళ్లి అతని కాళ్లుపట్టడం మొదలెట్టింది. నారాయణరావు కిమ్మనలేదు.

ఒంటిగంట అయింది. శ్యామల రెప్పలు నిద్రాభరాన్ని సహించలేక పోతున్నాయి. లేచింది. కిటికీదగ్గిరికెళ్లి నుంచుని శూన్యంలోకి చూసింది.

"నారాయణరావ్ గారూ"అంటూ రెండుమూడుసార్లు తలుపు దృఢంగా తట్టుతూ వొక వ్యక్తి కేకవేస్తున్నాడు.

నారాయణరావుకి మెలుకువ రాలేదు.

ఆలోచనల్లో మునిగిపోయిన శ్యామల ఉలిక్కి పడింది. వెళ్ళి తలుపుతీసింది.

"మాకేనా టెలిగ్రాం" ఆశ్చర్యంగా అడిగింది కంఠస్వరంలో భయం కనబరుస్తూ.

"అవునండి"

శ్యామల గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలెట్టాయి. లోపలికివెళ్లి శరీరంమీద చెయ్యివేస్తూ లేపింది.

కోపంగాకళ్లువిప్పి "ఏవిటిది"అన్నాడు నుదురు చిట్లిస్తూ.

ఉబుకుతోన్న కన్నీళ్ళని ఆపుకుంటూ "మీకు టెలిగ్రాం వొచ్చింది" అంది కంఠస్వరంలో గాద్గద్యం కనబరుస్తూ.

తటాలున లేచి నారాయణరావు టెలిగ్రాం పుచ్చుకున్నాడు. చెవుల్లో చెవులు పెట్టుకుని వినడానికి సిద్ధంగా వుంది శ్యామల. కళ్ళలో ఆతురత కనపడుతోంది.

నారాయణరావు ముఖం వలుపుదనం వహించింది. కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగాయి. "ఏవిటి?" అంది అతని కళ్లల్లోకి భయంగా చూస్తూ.

'ఊ! ఏం లేదు. సామాను సర్దు. నేను పూరి కెళ్లాలి అర్జెంటుగా" అని మూలిగాడు.

"ఎవరికీ అపాయం లేదుగదా"

"లేదు"

అకస్మాత్తుగావచ్చిన అల్లుడుగారికి కొంటెబావమరిది వీధి వాకిట్లోనే ఎదురైనాడు.

"ఏమోయ్! నేనీపూట వస్తానని మా అక్కయ్య అనుకొంటోందా?"

"ఆ!"

"నీకెలా తెలుసు?"

"అందుకనేగా మా అక్కయ్య పొద్దునే పక్కవూరికి ప్రయాణమై వెళ్ళిపోయింది!"

"ఎక్కడికెళ్లాలి"

"అవన్నీ నీకెందుకు?"

శ్యామల కింది పెదవి మీదికెత్తకుండా సామాను సర్దింది. నారాయణరావు సైకిలు రిక్షాలో సామాను వేసి వెళ్ళిపోతోంటే గడియారం రెండున్నర కొట్టింది

* * *

కాఫీకప్పు బల్లమీద పెడుతూ "శ్రీనివాసు లేడూ" అన్నాడు నారాయణరావు.

"ఏం? ఎక్కడికెళ్ళాడు?"

"ఏమో నాకేం తెలీదు. అర్జెంటు పనుందిట. కట్టుగుడ్డల్తోనే మీవూరు వెళ్లానని ఆఫీస్ బోయ్‌తో కబురంపారు."

"శారదా శ్రీనివాసు ఇట్లాంటివాడు అవుతాడని నేను కలలోకూడా అనుకో లేదు" సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు నారాయణరావు.

"నేనుమాత్రం అనుకున్నానురా అన్నయ్యా. ఆయనని కట్టుకున్న తర్వాత వొక్కరోజు సుఖంలేదనుకో. ఆఫీసులో ఆయనకి పాడుస్నేహితులు దొరికారు. డబ్బు అనవసరంగా ఖర్చుపెట్టేస్తారు. ఇంట్లో అవసరానికి ఒక వొస్తువైనా వుండదు. రాత్రిళ్ళు ఒకొక్కప్పుడు ఇంటికేరారు. అర్ధరాత్రీ అపరాత్రీ వొచ్చి నన్ను చావబాత్తారు. ఒకొక్కప్పుడు అసలే మాటలే ఆడరు. నా వొంటిమీద వొస్తువులన్నీ వొలిచేశారు. ఒకవారం రోజుల్లో అద్దరిభూమి రెండెకరాలూ అమ్మేశానంటున్నారు. నా నెక్లెస్ వొకటి తాకట్టుపెట్టారు. వారంనించి మా యిద్దరికీ మాటల్లేవు. నువ్వేనా వొచ్చి నా విషయాలు చక్కదిద్దుతావని టెలిగ్రాం పక్కింటి సోమనాథంగారి కుర్రాడు గోపాలంచేత యిప్పించాను."

చెబుతున్నంతసేపూ శారద వెక్కివెక్కి ఏడ్చింది. నారాయణరావు గుడ్లప్పగించి చూస్తూనే వున్నాడు. ఆ పదినిమిషాలు అతనిలో చైతన్యంలేదు. మనస్సు ఎక్కడో పనిచేస్తోంది. ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో నూరు రూపాయలు తగలెయ్యడం టౌన్ హాలులో లీడరు శ్రీరామమూర్తితో కలిసి యాభైరూపాయిలు వోడిపోవడం శ్యామల జాజిమొగ్గల నెక్లెస్ రాత్రికి రాత్రి బీరువాలోంచి తీసి అమ్మెయ్యడం ఇవన్నీ గుర్తుకు వొచ్చాయి.

క్షమాపణ పూర్వకంగా శారదయొక్క నల్లటి కాంతివంతమైన కళ్లల్లోకి చూస్తూ "శారదా నువ్వేమీ కంగారుపడకు. నీ సంసారం చక్కబరుస్తాను. కాని నన్ను మాత్రం నువ్వు క్షమించాలి. నీ స్నేహితురాలు శ్యామలని చాలా అన్యాయం చేస్తున్నాను..."

పావుగంట గడిచింది. శారద నారాయణరావులు ఆర్ద్రనేత్రాల్ని తుడుచుకున్నారు. రెండు నిమిషాలు నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ "శారదా శ్రీనివాసం మా యింటికి వెళ్ళుంటాడని నాకు అనిపిస్తోంది."

శారద కనులలో ఆశ్చర్యం తొణికిసలాడింది.

"ఏం లేదు. ఊరికే నాకలా కనపడుతోంది"

ఇద్దరూ మౌనంగా కూచున్నారు.

తలుపు ఎవ్వరో తట్టారు. శారద తలుపు తీసింది. శ్యామలా శ్రీనివాసం లోపలికి వొచ్చారు.

పది నిముషాలు వాళ్ల జీవితాల్ని మార్చుకునేటట్టు వాళ్లు తీర్మానించుకున్నారు. ఈ ఏడాది రెండు కాపరాల్లోని భర్తల ప్రవర్తనకూ చింతించారు. తమ జీవితాధ్యాయంలోని రెండవ పుటలో విచారపు నీడలు ఉండరాదనుకున్నారు.

పరస్పరాలింగనాలైనాయి. శ్రీనివాసం ఉడికించేటట్టు "నీకో వొస్తువు తెచ్చాను" అన్నాడు శారదవెంపు తిరిగి.

ఉడికించి ఉడికించి నెక్లెస్ పైకితీశాడు శ్రీనివాసం. "తాకట్టు విడిపించారా" అన్నది కళ్ళలో మెరుపుతీగలు పాకగా.

"ఒరేయ్ శ్రీనివాసం నీ స్నేహితురాలు శ్యామల సంసారాన్ని చక్కదిద్దేవ్ సరేగాని దానికో ఉపకారం చెయ్యాలిరా."

ప్రశ్నార్థకంగా రెప్పల అడుగునించి చూశాడు శ్రీనివాసం.

"నీ బేంక్ చెక్‌బుక్ తియ్. శ్యామలకో నెక్లెస్ నే కొనివ్వాలి."

శ్యామల నీలపు కళ్లు మెరిశాయి.

శారదవైపు తిరిగి "చెక్‌బుక్ తీసుకురా శారదా. తర్వాత స్ట్రాంగ్ కాఫీ తయారు చెయ్యి. మనం నలుగురం షాపింగుకు పోవాలి ఇవాళ"

శారద బుగ్గలు సొట్టలు పడేట్టు నవ్వుతో "ఉత్త షాపింగేనా షో చూడొద్దూ."

శ్యామల అందుకుంటూ "మన సంసారపు షోలు చాలదూ" అంది ముసిముసి నవ్వులు ముఖంమీద పరుచుకుంటూ.

★


అతిమూత్రవ్యాధి
వారంరోజులలో
నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు.(**Diabetes**) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రము బయలు వెడలటము. దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు
ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,
పోస్టుబాక్సు నం. 587. కలకత్తా (A. P.W)